అగ్రిగోల్డు భూముల మ్యుటేషన్: డిఆర్ఓ

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో అగ్రిగోల్డుకు సంబంధించిన ఆస్తులను వెంటనే మ్యుటేషన్ చేయా లని డిఆర్ఓ కె మోహన్ కుమార్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో డిఆర్ఓ ఛాంబర్‌లో అగ్రిగోల్డు భూములకు సంబంధించి జిల్లా స్థాయి కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్వో మాట్లాడుతూ వి కోట, ఐరాల, మండలాల్లో ఉన్న అగ్రిగోల్డ్ ఆస్తులు, చిత్తూరు, పలమనేరు మున్సిపాల్టీ పరిధిలో ఉన్న అగ్రిగోల్డు ఆస్తులు, వాటి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అగ్రిగోల్డ్ ఆస్తులకు సంబంధించి భౌతిక ధృవీకరణ పూర్తి చేసుకుని రికార్డులు సిద్ధంగా ఉంచుకోవాలని, సబ్ రిజిస్టర్ విలువ, మార్కెట్ విలువ గుర్తింపు చేయాలని, అగ్రిగోల్డ్ ఆస్తుల మ్యుటేషన్‌కు సంబంధించిన అంశాలపై దృష్టి సారించాలన్నారు. ప్రస్తుతం అగ్రిగోల్డ్ భూముల పరిస్థితి ఏంటి? ఆక్రమణలు, కోర్టు కేసులు, తదితర అంశాలకు సంబంధించి పరిశీలించాలన్నారు. గురువారం సాయంత్రంలోపు వ్యవసాయ భూముల మ్యుటేషన్ ప్రక్రియను పూర్తిచేయాలని తహశీల్దారులను ఆదేశించారు. జిల్లా స్థాయిలో జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. జిల్లా రిజిస్ట్రార్, జిల్లా పౌర సంబంధాల అధికారి, జిల్లా ఐటి ఆఫీసర్, తిరుపతి సిఐడి, ఆర్వో ఆఫీసర్, చిత్తూరు , పలమనేరు మున్సిపాల్టీ కమిషనర్లు, ఐరాల, వి కోట తహశీల్దారులు మెంబర్లగా, జిల్లా స్థాయి కమిటీలు ఏర్పాటు చేశామని తెలిపారు. భూముల మ్యుటేషన్ పూర్తయిన తరువాత ప్రభుత్వ నిబంధనల ప్రకారం పలు చర్యలు చేపడతారని తెలిపారు. ఈ సమావేశంలో తిరుపతి డిఎస్పి రసూల్ సాహెబ్, జిల్లా రిజిస్ట్రారు కార్యాలయం ప్రతినిధి కే రాంప్రసాద్, డిడి, ఐఅండ్‌పిఆర్ వేలాయుధం, పలమనేరు మున్సిపల్ కమిషనర్ ఎన్‌వి రమణారెడ్డి , చిత్తూరు మున్సిపల్ కమిషనర్ నరసింహ ప్రసాద్, ఐరాల తహశీల్దారు లోకేశ్వరి, వి కోట తహశీల్దారు ఉదయ సంతోష్, డి సెక్షన్ సూపరిం టెండెంటు పద్మజ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఆర్వో కె మోహన్

పిహెచ్‌సి డిజిటల్ నెర్వ్ సెంటరును పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి -శాంతిపురం : కుప్పం నియోజకవర్గంలో 13 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో టాటా సంస్థ ద్వారా డిజిటల్ నెర్వ్ సెంటర్ లతో అనుసంధాన్ని ముఖ్యమంత్రి ఇటీవల ప్రారంభించారు. రాళ్ళబూదు గూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని డిజిటల్ నెర్వ్ సెంటర్ ను కలెక్టర్ సుమిత్ కుమార్ మంగళవారం పరిశీలించారు. ఇప్పటి వరకు కొనసాగిన కార్యకలా పాలను డాష్ బోర్డులను పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చికిత్స నిమిత్తం వచ్చే వారి వివరాలను ఎలా నమోదు చేస్తున్నారని తెలుసుకుని అందులో తలెత్తిన కొన్ని సమస్యలను సంబంధిత వారికి తెలిపి సమస్యల పునరావృతం కాకుండా చూడాలన్నారు. రానున్న రెండు మూడు నెలల్లో ఆరోగ్య కేంద్రాలకు చికిత్స నిమిత్తం వచ్చేవారి సంబంధించిన మొత్తం సమాచారం డిజిటల్ నెర్వ్ సెంటర్ లో అందుబాటులో ఉంటుందని, దీని ద్వారా త్వరగా చికిత్స పొందే వెసులుబాటు కలుగుతుందని తెలిపారు. రెండో దశలో చిత్తూరు జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను అనుసంధానం చేస్తామన్నారు. రాళ్ళబూదుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని సమస్యల గురించి మెడికల్ ఆఫీసర్ శివకుమారిని అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారం కోసం సూచించారు. అనంతరం అక్కడి నుండి రాళ్ళబూదుగూరు లోని అతి పురాతన శ్రీ కోదండరామస్వామి వారి దేవస్థానాన్ని దర్శించుకున్నారు. ఆలయ పూజారి దేవస్థానం విశిష్టతను విశేషాలను కలెక్టర్ కు వివరించారు. రాళ్ళబూదుగూరు నాయకులు గ్రామస్థులు గ్రామంలో కమ్యూనిటీ భవనం, పంచాయితీకి ఓహెచ్‌ఎస్‌ఆర్ వాటర్ ట్యాంకులు, అంగన్వాడీ భవనం, ప్రస్తుతం గ్రామాల్లో వేస్తున్న కుప్పం కే జి ఎఫ్ సిమెంటు రోడ్డు 250 మీటర్లు మాత్రమే అనుమతులు వుందని 600 మీటర్ల వరకు పొడిగించాలని కలెక్టర్‌ను కోరారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ ప్రతిపాదనలు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఏ పీ ఆర్ కుమార్, పంచాయతీ కార్యదర్శి శివ శంకరయ్య, వీఆర్వో ప్రకాష్, టిడిపి నాయకులు ఆర్ ఎస్ మని, బసవరాజు, మురళీ, కుమార్, ఏం ఆర్ నారాయణ, గోపినాథ్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యత: ఐజిపి

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యత కల్పిస్తున్నామని ఉమెన్ సెఫ్టీ ఐజిపి రాజకుమారి అన్నారు. అనంతపురం రేంజ్ అధికారులతో ఉమెన్ సేఫ్టీ ఐజిపి రాజ కుమారి మంగళవారం జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లా నుండి ఎస్‌పి మణికంఠ చందోలు, జిల్లాలోని ఇన్‌స్పెక్టర్లు ఈ సమావేశానికి హాజరయ్యారు. పోలీస్ గెస్ట్ హౌస్, కాన్ఫరెన్స్ హాలులో ఈ సమావేశం నిర్వహించారు. మొదట పెండింగ్‌లో ఉన్న పివోసిఎస్‌వో కేసుల పరిశీలనలో భాగంగా పిల్లలపై లైంగిక నేరాలకు సంబంధించిన పిఓసిఎస్‌ఓ కేసుల పరిష్కార దశలు, విచారణా పురోగతి, న్యాయస్థానాలలో కేసుల స్థితిగతులు, తదితర విషయాలపై సమగ్రంగా సమీక్షించారు. నేరాన్ని త్వరగా నిర్ధారించేలా విచారణను వేగవంతం చేయాలని, కోర్టుల్లో శీఘ్రంగా ఛార్జ్‌షీట్‌లను దాఖలు చేయాలని అధికారులను ఆదేశించారు. లైంగిక నేరాలపై నమోదైన కేసులకు సంబంధించి 60 రోజుల్లో ఛార్జ్‌షీట్ వేసే అంశంపై ప్రతి జిల్లా పనితీరును సమీక్షించారు. ఆలస్యం లేకుండా ఛార్జ్‌షీట్లు వేయడం ద్వారా న్యాయం త్వరగా జరిగేలా చూడాలని సూచించారు. మహిళలు, బాలికలు మిస్సింగ్ అయిన కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. వీటిలో ప్రేమ వ్యవహారాలు, కుటుంబ సమస్యలు వంటి కారణాలపై స్పష్టత తీసుకురావాలన్నారు. ప్రతి కేసును ఒక మానవీయ కోణంలో పరిశీలించి, బాధితుల రక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లైంగిక నేరాల చరిత్ర కలిగిన వ్యక్తులపై షీట్‌లు తెరచడం ద్వారా వారిని కంట్రోల్ చేయాలని, పునరావృత నేరాలకు అడ్డుకట్ట వేయాలని సూచించారు. వారి వాహనాలు, నివాస ప్రాంతాలపై నిఘా కొనసాగించాలని పేర్కొన్నారు. మహిళలపై నేరాలు, వేధింపులు వంటి అంశాలపై గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో శక్తి టీమ్స్ భాగస్వామ్యంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. స్కూల్స్, కాలేజీలు, బస్ స్టాండ్లు, రైల్వే స్టేషన్లు వంటి ప్రదేశాల్లో ప్రజల్లో చైతన్యం పెంచేలా కృషి చేయాలన్నారు. ఈ జూమ్ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా ఎస్‌పితో పాటు జిల్లాలోని డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు, మహిళా స్టేషన్ ఎస్‌ఐ పాల్గొన్నారు.

కంపు..కంపు..!

- పలమనేరు మార్కెట్ యార్డు పరిసరాలు దుర్గంధ భరితం
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణం అధికారుల నిర్లక్ష్యం మూలంగా దుర్గంధ భరితంగా మారింది. ఎక్కడబడితే అక్కడ అజాగ్రత్తగా కూరగాయలు, ఆకుకూరలు, మామిడికాయలు, తదితరాలు పడవేశారు. అవి కుళ్ళి దుర్గంధ భరితంగా తయారైంది. మార్కెట్ యార్డుకు వచ్చిన రైతులు చెడు వాసన భరించలేక ముక్కులు మూసుకుని వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. అంతేకాక మార్కెట్ యార్డులో ఎక్కడబడితే అక్కడ మల, మూత్ర విసర్జన చేస్తున్నారు. ఫలితంగా దుర్వాసన వస్తోంది. మార్కెట్ యార్డు ప్రాంగణాన్ని పర్యవేక్షిం చాల్సిన అధికారులు నిర్లక్ష్యం మూలం గా ఇలా మార్కెట్ యార్డు తయారవుతోందని పలువురు రైతులు వాపోతున్నారు. దీనికి తోడు మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఈ వ్యర్థ పదార్థాలు ఇంకా ఎక్కువగా కుళ్లి దుర్గంధ భరితంగా మారాయి. దీని వల్ల దోమలు, ఈగలు, సుక్ష్మ క్రిములు విపరీతంగా ఉత్పత్తి చెంది ప్రజలకు అనేక వ్యాధులు ప్రబలే అవకాశం వుంది. సంబంధిత అధికారులు వెంటనే తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

దుర్గంధ భరితంగా మారిన పలమనేరు మార్కెట్ యార్డు పరిసరాలు

30కి పైగా పరిశ్రమల్లో 300 నియామకాలు

- ఆత్మస్థైర్యంతో పనిచేయాలని కడ పీడీ హితవు
- నిరుద్యోగ నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యమన్న ఎమ్మెల్సీ

ప్రజాశక్తి- కుప్పం : కుప్పం పట్టణం కడ కార్యాలయ ఆవరణలో మంగళవారం నిర్వహించిన జాబ్ మేళా విజయవంతంగా ముగిసింది. కడ పీడీ వికాస్ మరమ్మత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, కలెక్టర్ సుమిత్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మొదట కలెక్టర్ మాట్లాడుతూ ఈ జాబ్ మేళాలో 30 కి పైగా పరిశ్రమలు పాల్గొనడం హర్షణీయమన్నారు. జాబ్ మేళా స్థానికంగా నిరుద్యోగ నిర్మూలనకు ఎంతో దోహదపడుతోందన్నారు. ఈ జాబ్ మేళా కార్యక్రమానికి ముందు నిరుద్యోగులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా సోమవారం నిరుద్యోగులకు అవగాహనతో పాటు ముందస్తు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. పదవ తరగతి, ఐటిఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, పీజీ పూర్తిచేసిన పట్టభద్రులు పెద్ద ఎత్తున జాబ్ మేళాలో పాల్గొన్నారని, ఉద్యోగులుగా ఎంపికైన నిరుద్యోగులకు 14 వేలు నుండి 60 వేలరూపాయల వరకు వేతనం చెల్లించ డానికి పరిశ్రమల ప్రతినిధులు అంగీకరించారన్నారు. కడ పీడీ మాట్లాడుతూ నిరుద్యోగ నిర్మూలనకు తమ ఆధ్వర్యంలో జాబ్ మేళా కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఉద్యోగులుగా ఎంపికైన నిరుద్యోగులు ఆత్మస్థైర్యంతో తమ విధులను నిర్వహించాలని సూచిస్తూ, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ కుప్పం నియోజక వర్గంలోని యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలలో అనుసరించి ఆయన సొంత నియోజకవర్గంలో జాబ్ మేళా నిర్వహించామని తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కూటమి పార్టీల తరఫున నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి కచ్చితంగా నెరవేరుస్తారన్నారు. ప్రస్తుతం నిర్వహించిన జాబ్ మేళాలో 300 మందికి పైగా ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు తెలిపారు. ఉద్యోగులుగా నియామకమైన వారికి నియామక పత్రాలు అందించారు. ఈ కార్యక్ర మం లో ఏపీఎస్ఆర్టీసీ ఉపాధ్యక్షులు పి ఎస్ మునిరత్నం, టిడిపి రాష్ట్ర కార్యనిర్వా హక కార్యదర్శి డాక్టర్ సురేష్ బాబు, పట్టణ టిడిపి అధ్యక్షులు రాజ కుమార్ తదితర నాయకు లు, ప్రజా ప్రతినిధులు, కడ సలహా మండలి సభ్యులు, పలు పరిశ్రమల ప్రతినిధులు, నిరుద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఎంపికైన వారికి ఉద్యోగ నియామక పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్సీ

కూటమి ప్రభుత్వం దగా..

- మాజీ మంత్రి ఆర్‌కె రోజా

ప్రజాశక్తి -విజయపురం (నగరి) : ఆడబిడ్డల నిధి పేరిట రెండు కోట్ల మంది మహిళలను కూటమి ప్రభుత్వం మోసగించిందని మాజీ మంత్రి ఆర్కేరోజా అన్నారు. ఆడబిడ్డల నిధి అమలు చేయాలంటే రాష్ట్రాన్ని విక్రయించాలి..' అంటూ టీడీపీ పశుసంవర్ధక, పాడిపరిశ్రమ అభివృద్ధి, మత్స్య శాఖ మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొనడంపై ఆమె మంగళవారం విలేకరుల సమావేశంలో ఈ మేరకు స్పందించారు. సంక్షేమ పథకాలు అమలు చేయాలంటే డబ్బులు కావాలి.. ఆడబిడ్డ నిధి పథకం అమలు చేయాలంటే ఆంధ్రప్రదేశ్‌ను అమ్మాలి..' అంటూ ఒక మంత్రి నిస్సిగ్గుగా మాట్లాడటంతో ఎన్నికల్లో గెలవడానికే అమలుకాని హామీలు ఇచ్చినట్లు స్పష్టమైందన్నారు. ఎన్నికల ముందు హామీలు ఇచ్చేటప్పుడు ఎంత మంది మహిళలు ఉన్నారు. పథకం అమలుచేందుకు ఎంత నిధులు అవసరమవుతుందని వీరికి తెలియదా? అని ప్రశ్నించారు. అప్పుడేమో ఓట్లు కోసం అడ్డమైన హామీలు ఇచ్చేసి, అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా పథకాన్ని అమలు చేయక నేడు రాష్ట్రాన్ని అమ్మాలి, దేశాన్ని అమ్మాలి అంటే ఆడబిడ్డలు ఊరుకోరన్నారు. కూటమి ఇచ్చిన హామీలు అమలుచేయాలంటే ఒక దేశానికి అవసరమైనంత బడ్జెట్ అవసరమవుతుందని తాము ఆనాడే చెప్పామన్నారు. హామీలు ఎలా అమలుచేయాలో తమకు తెలుసని, తగిని పథకరచన చేసుకున్నామని నాడు కల్లబొల్లి మాటలు పలికి నేడు రాష్ట్రాన్ని అమ్మాల్సి వస్తుందనడం చూస్తుంటే వీరు ఆడబిడ్డలను ఏమార్చడానికే పక్కాగా పథకరచన చేసుకున్నట్లు తేలిపోయిందన్నారు.

ఉపాధ్యాయుడి మృతికి సంతాపం

ప్రజాశక్తి -బంగారు పాల్యం: గుండెపోటుతో మృతి చెందిన ఉపాధ్యాయుడు రమేష్ నాయుడుకు విద్యాశాఖ ఆధ్వర్యంలో నివాళులర్పించి ప్రభుత్వం అందించే మట్టి ఖర్చుల నగదును ఆయన సతీమణికి మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు, పలువురు ఉపాధ్యాయ సంఘం నాయకులు ఆధ్వర్యంలో మంగళవారం అందించారు. ఆయన మృతి చెందడం చాలా బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మీపతి, మోహన్ రెడ్డి, జగదీష్, రఘుపతి నాయుడు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇలా వదిలేశారు..!

- అసంపూర్తిగా సచివాలయ భవనాలు
- స్పందించని కూటమి ప్రభుత్వం
- సొంత భవనాలు లేక సిబ్బంది తిప్పలు

వైసీపీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థను రూపొందించారు. అందులో భాగంగా గ్రామ సచివాలయ భవనాల నిర్మాణం చేపట్టారు. ఒక్కొక్కటి రూ.40 లక్షల వ్యయంతో నిర్మించారు. కొన్ని గ్రామాల్లో సచివాలయ భవనాల నిర్మాణానికి స్థలాలు అందుబాటులో లేక కట్టడాలు ముందుకు సాగలేదు. కొన్ని గ్రామాల్లో నిర్మాణాలు ప్రాంభించి పూర్తి చేశారు. ప్రస్తుతం సచివాలయ కార్యకలాపాలు ఆ భవనాల్లోనే సాగుతున్నాయి. కొన్ని గ్రామాల్లో నిర్మాణాలు అర్థాంతరంగా ఆగిపోయాయి. దీంతో సచివాలయాలకు సొంత భవనాలు లేక సిబ్బంది పడరాని పాట్లు పడుతున్నారు.

ప్రజాశక్తి -(విజయపురం) : వైసీపీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో సచివాలయ వ్యవవస్థను ఏర్పాటు చేసింది. అందులో భాగంగా గ్రామ సచివాలయ భవనాల నిర్మాణం చేపట్టారు. ఒక్కొక్కటి రూ.40 లక్షల అంచనా వ్యయంతో నిర్మాణాలు చేపట్టారు. కొన్ని గ్రామాల్లో సచివాలయ భవనాల నిర్మాణానికి స్థలాలు అందుబాటులో లేక కట్టడాలు ప్రాంభించలేదు. కొన్ని గ్రామాల్లో నిర్మాణాలు ప్రాంభించి పూర్తి చేశారు. సచివాలయ కార్యకలాపాలు ఆ భవనాల్లోనే సాగుతున్నాయి. కొన్ని గ్రామాల్లో నిర్మాణాలు అర్థాంతరంగా ఆగిపోయాయి. పునాదుల దశలో కొన్ని, 50, 60శాతం పనులు జరిగి అసంపూర్తిగా ఉన్నాయి. సచివాలయ భవనాల నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్లు కొంతమందికి వైసీపీ బిల్లులు కూడా చెల్లించలేదు. గ్రామాల్లో సచివాలయాలతో పాటు రైతు భరోసా కేంద్రాలు, ఆరోగ్య సంరక్షణ కేంద్రాలు మంజూరు చేశారు. వీటిలో కొన్ని పూర్తయ్యాయి. కొన్ని అసంపూర్తిగా ఉన్నాయి.

పట్టించుకోకపోవడంతో గోడలు పగిలిపోయిన విజయపురం సచివాలయం

అసంపూర్తిగా సచివాలయ భవనాలు

విజయపురం మండలంలో మొత్తం 12 సచివాలయాలలో నాలుగు సచివాలయాల భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు కాలేదు. మొత్తం 12 సచివాలయాల్లో 8 సచి వాలయ భవానాలు నిర్మాణం పూర్తి చేసుకొని కార్యాలయాలు నడుస్తు న్నాయి. 50 శాతం పూర్తయిన సచివాలయాల్లో సూరి కాపురం, విజయ పురం, శ్రీహరి పురం, బూచి వానత్తం సచివా లయాలు ఉన్నాయి. సూరికాపురం, విజయ పురం స్లాబ్ వరకు నిలిచి పోయింది.

50 శాతం పైగా పూర్తయి ముళ్ల పొదలతో నిండి నిరుపయోగంగా మారిన సచివాలయం

స్పందించని కూటమి ప్రభుత్వం

కూటమి ప్రభుత్వం అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణాలకు నిధులను మంజూరు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు. రూ.5 లక్షలలోపు నిధులతో పూర్తయ్యే భవనాలను వెంటనే పూర్తి చేయించాలని ఆయా స్థానికులు ప్రజలు కోరుతున్నారు. అయినా కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చినప్పటి నుంచి సచివాలయ వ్యవస్థను పట్టించు కోక పోవడం గమనార్హం.

ఇరుకు గదిలో సిబ్బంది

విజయపురం, సూరికా పురం, శ్రీహరిపురం, బూచివా నత్తం గ్రామాల్లో సచివాయలయాలు లేక సిబ్బంది చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఇరుకు గదుల్లో నానా కష్టాలు పడుతున్నారు. ఉన్న భవనాలు కూడా చిన్నపాటి వర్షాలకు ఉరుస్తున్నాయి. కంప్యూటర్లు, టేబుల్స్, రికార్డులు సైతం తడిచి పోతున్నాయి. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం అసంపూర్తిగా ఉన్న సచివాయ ల భవనాలకు నిధులకు మంజూరు చేయాలని డిమాండు చేస్తున్నారు.

ఏ నిమిషానికి ఏమి జరుగునో..!

- ఆ దారిలో వెళ్లాలంటే దడ
- గుంతలమయమైన రహదారి
- ఏపుగా పెరిగిన వృక్షాలపైనే విద్యుత్ తీగలు
- భయం గుప్పెట్లో పాలిటెక్నిక్ కళాశాల, గురుకుల పాఠశాల విద్యార్థులు

'ఏ నిమిషానికి ఏమి జరుగునో ఎవరు ఊహించెదరు?' అన్న చందంగా మారింది.. పాలిటెక్నిక్, గురుకుల పాఠశాల విద్యార్థుల పరిస్థితి. పలమనేరు పట్టణానికి కిలో మీటరు దూరంలో వున్న పాలిటెక్నిక్, గురుకుల పాఠశాలలకు వెళ్లే రహదారి జాతీయ రహదారి నుండి పర్లాంగు దూరంలో వుంది. ఈ దారి పూర్తిగా గుంతల మయ మైంది. ఇటు, అటు ముళ్ల పొదలు పెరగడంతో అటవీ ప్రాంతాన్ని తలపిస్తోంది. దారి పొడవునా ఏపుగా పెరిగిన చెట్ల కొమ్మలను తాకుతూ 11 కెవి విద్యుత్ లైన్లు వెళుతుండడంతో ఏ సమయానికి ఏ ప్రమాదం ముంచు కొస్తుందో తెలియని పరిస్థితి ఏర్పడింది. దీనికి తోడు పాఠశాలకు వెళ్లాలన్నా ఇళ్ల మధ్య వెళ్లాల్సి వస్తోందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కంకర తోలి వేదిలేసిన దారి

ప్రజాశక్తి - పలమనేరు రూరల్ (గంగవరం): పలమనేరు పట్టణానికి కేవలం కిలోమీటరు దూరంలో ఉన్న పాలిటెక్నిక్ కళాశాల, గురుకుల పాఠశాలలు జాతీయ రహదారి నుండి పాఠశాలకు, కళాశాలకు వెళ్లే రహదారి పర్లాంగు దూరంవుంది. ఈ దారి పూర్తిగా గుంతలమయమై నడవడానికి వీలులేకుండా వుంది. అడుగు వేస్తే కాళ్లు, చేతులు విరిగే దుస్థితిలో వుందని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గుంతలమయమైన రహదారి

పాలిటెక్నిక్ కళాశాల నుండి గురుకుల పాఠశాలకు ఐదువందల మీటర్లు దూరం వుంది. ఎనిమిదేళ్ల క్రితం అప్పటి టిడిపి ప్రభుత్వంలో కంకర తోలి వదిలేశారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు వారి తల్లిదండ్రులు విధిలేని పరిస్థితుల్లో ఇళ్ల సందులో నుండి పాఠశాలకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. గతంలో మాజీ ఎమ్మెల్యే ఈ పాఠశాలను సందర్శించినప్పుడు పరిస్థితిని స్వయంగా కళ్లతో చూసి వెంటనే బాగు చేస్తానని వెళ్లిపోయారని విద్యార్థులు వాపోతున్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి దృష్టికి సైతం అనేకసార్లు ఈ సమస్యపై అర్జీలు అందించామని అయినా స్పందన లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏపుగా పెరిగిన వృక్షాలపైనే విద్యుత్ తీగలు

ఈ దారికి ఇరువైపులా ముళ్లపొదలు పెరిగిపోవడంతో విద్యార్థులను చూడడానికి వచ్చే తల్లిదండ్రులు ఆరు గంటలలోపే వారి పిల్లలను కలుసుకొని వేరే మార్గాలలో వెళుతున్నా రు. దీనికి తోడు ఏపు గా పెరిగిన వృక్షాలకు 11 కెవి విద్యుత్ వైర్లు తగులుతూ ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచు కొస్తుందో అన్న భయం వెంటాడు తోంది. ఈ దారిలోనే చెరువుల నీటి పారుదల శాఖ కార్యాలయం కూడా వుంది. ఈ సమస్యను అధికారులు సైతం అనేక సార్లు నాయకులకు తెలిపామని పేర్కొన్నారు. ఈ కళాశాల, గురుకుల పాఠశాలకు అతి దగ్గరలోని రెవెన్యూ డివిజనల్ కార్యాలయం, మండల రెవెన్యూ కార్యాలయం, కోర్టు, పౌరసరఫరాల శాఖ కార్యాలయం వుంది. వాటికి మాత్రం తారు రోడ్లు నిర్మించి ఈ పాఠశాలలకు ఎందుకు రోడ్డు వేయలేదో అర్థం కావడం లేదని తల్లిదండ్రులు, అధ్యాపకు లు ప్రశ్నిస్తున్నారు. పలు సందర్భాలలో జిల్లా అధికారులు ఈ కళాశాలకు పాఠశాలకు వచ్చిన సందర్భాలలో వారు సైతం నాయకులకు అధికారులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకపోయిందని అంటున్నారు

వృక్షాల మీదుగా వెళుతున్న విద్యుత్ వైర్లు

భయం గుప్పెట్లో విద్యార్థులు

గురుకుల పాఠశాలలో 570 మంది విద్యార్థులు చదువుతున్నారు.. రాత్రి 7 గంటల నుండి 10 గంటల వరకు, వేకువ జామున ఐదు గంటల నుండి ఏడు గంటల వరకు స్టడీ అవర్స్ చెప్పడానికి తప్పని సరిగా మేము రావాలి..ఈ దారి పూర్తిగా పాడైపోవడంతో అడ్డదారుల్లో వస్తున్నాం..రాత్రి వేళల్లో ఎక్కడ పాముల బారిన పడతామో అన్న భయం వెంటాడుతోంది. మరోవైపు ఎక్కడ తాగుబోతులు మాపై దాడి చేస్తారో అన్న భయంతో గడుపుతున్నాం.

- మీనాక్షమ్మ, గురుకుల పాఠశాల అధ్యాపకురాలు.

కంకర తోలి వదిలేసారు..

చాలాకాలం నుండి ఈ దారిలో కంకర తోలి వది లేసారు.. ఇళ్ల సందుల నుండి పాఠశాల దగ్గరకు వచ్చి పిల్లల గురించి ఆలోచించాల్సిన దుస్థితి ఏర్పడింది. పాలిటెక్ని కల్ కళాశాలలో 710 మంది విద్యార్థులు చదువు తున్నా రు.. కళాశాల దారి పూర్తిగా గుంతల మయమైంది. కనీ సం నడవలేని స్థితిలో వున్నాం.. కనీసం గుంతలైనా పూడ్చాలని అనేకసార్లు అధి కారులకు, నాయకులకు మొర పెట్టుకున్నాం..అయితే ఎవరూ పట్టించు కోలేదు.. దీంతో పాటు చెట్లపైనే 11 కెవి విద్యుత్ లైను ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ఎదురవుతుందో అన్న భయం వుంది. విద్యార్థులు, సిబ్బందికి సాయంత్రం 6 గంటల తర్వాత కళాశాలకే పరిమితం చేశారు.. అధికారులు స్పందించి పాలిటెక్నిక్ కళాశాలకు, గురుకుల పాఠశాలకు దారి సౌకర్యం కల్పించాలి.

- మహేష్ బాబు దంపతులు, విద్యార్థుల తల్లిదండ్రులు.

పోలీసులు నైపుణ్యత పెంచుకోవాలి

నేర సమీక్షా సమావేశంలో ఎస్‌పి

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : పోలీసులు నైపుణ్యత పెంచుకోవాలని విజిబుల్ పోలీసింగ్ పెంచే విధంగా పని చేయాలని నేర సమీక్ష సమావేశంలో ఎస్‌పి మణికంఠ చందోలు అధికారులను ఆదేశించారు. అర్ధ వార్షిక నేర సమీక్షా జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులతో ఎస్‌పి మాట్లాడుతూ గత ఆరు నెలలుగా జిల్లా వ్యాప్తంగా వివిధ అంశాలపై నిర్వహించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ వాటి ఫలితాల గురించి, రోడ్డు భద్రతకు, రోడ్డు ప్రమాదాలు తగ్గించడంలో అమలు జరిపిన కార్యాచరణల గురించి, మాదకద్రవ్యాల అక్రమ రవాణా అరికట్టడం, నాన్-బైలబుల్ వారంట్స్ గురించి చర్చించారు. పెండింగ్ లో ఉన్న యుఐ, పిటి, గ్రేవ్ కేసులు, హత్యలు, మిస్సింగ్ కేసులు, దోపిడీ దొంగతనాలు, మిస్సింగ్ కేసులు, పీవోసీఎస్‌వో కేసులను, గ్రేవ్ , నాన్ గ్రేవ్ కేసులు, మహిళలపై జరిగే నేరాల వివరాలు, తదితర కేసులను లోతుగా పరీక్షించారు. కేసులను త్వరిత గతిలో నేర పరిశోధన చేసి పరిష్కరించాలని ఆదేశించారు. ఎస్‌సి, ఎస్‌టి కేసుల్లో పురోగతిపై సమీక్ష చేశారు. డేటాను తక్షణమే క్రమం తప్పకుండా నవీకరించాలని ఆదేశించారు. ప్రతి మార్పును డేటాలో వెంటనే నమోదు చేసి, అప్‌డేట్ చేయాలి సూచించారు. సిసిటిఎన్‌ఎస్ వ్యవస్థలో డేటాను ఎప్పటికప్పుడు సరైన విధంగా అప్డేట్ చేయడం అవసరం అన్నారు. క్రైమ్, క్రిమినల్ వివరాలను సిసిటిఎన్‌ఎస్‌లో నిరంతరం నవీకరించాలని ఆదేశించారు. సమయానికి సిసిటిఎన్‌ఎస్ డేటాను సరిగ్గా నమోదు చేసి, అప్‌డేట్ చేయడం నిర్ధారించాలన్నారు. అసాంఘిక కార్యకలాపాల అణచివేతకు డ్రోన్‌ల సాయంతో నిఘా పెంచాలన్నారు. ఇప్పటికే సిబ్బందికి డ్రోన్ శిక్షణ ఇచ్చామన్నారు. ఆధునిక సాంకేతికతను ఉపయోగించి నేర పరిశోధన, శాంతి భద్రతల పరిరక్షణ, భారీ సమావేశాల్లో భద్రతా చర్యలు తీసుకోవడం వంటి విభిన్న దశల్లో డ్రోన్లు ఉపయోగపడతాయన్నారు. ముఖ్యంగా పెద్ద ఎత్తున జరిగే సభలు, ర్యాలీలు, ట్రాఫిక్ కంట్రోల్, అటవీ ప్రాంతాల పర్యవేక్షణ, కల్తీ మద్యం తయారీ స్థలాల గుర్తింపు వంటి విభాగాల్లో డ్రోన్ లు సహాయపడుతాయన్నారు. ప్రజలందరిలో సైబర్ మోసాలపై అవగాహన పెంచేలా మీరు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనుమానాస్పద లింకులు, మెయిల్స్ ఓపెన్ చేయడం వల్ల బ్యాంకు ఖాతాలలో నగదు మాయం అయ్యే ప్రమాదం ఉన్నదని ప్రతి ఒక్కరికి తెలపాలన్నారు. యాప్ ద్వారా లోన్ ఇస్తామంటూ ఫోన్లు చేసే దుర్మార్గుల నుండి జాగ్రత్తగా ఉండాలని, అవి మోసాలే అన్న విషయాన్ని గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణాల వరకూ అందరికి వివరించాలి. ఎవరైనా మోసపోయినట్టయితే భయపడకుండా వెంటనే 1930 నెంబర్‌కు కాల్ చేయాలి లేదా హెచ్‌టిటిపి://సైబర్‌క్రైమ్. జివోవి.ఇన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. జిల్లా పోలీస్ వాట్సప్ నెంబర్ 9440900005, సైబర్ మిత్ర 9121211100 లకు సమాచారం ఇవ్వాలన్న విషయాన్ని కూడా ప్రచారం చేయాలన్నారు. ఈ సమావేశంలో కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విద్యాధరి, డిఎఫ్‌వో శధరణి, డిఆర్వో మోహన్ కుమార్, రైల్వే డిఎస్పీ హర్షిత, ఆర్‌టివో రంజిత్ కుమార్, డీఈవో వరలక్ష్మీ, జిల్లా వ్యాప్త డిఎస్‌పిలు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

సాంబశివ నాయుడు మృతి తీరని లోటు: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్ : గుడిపాల మండల సీనియర్ టీడీపీ నాయకులు , మాజీ ఎంపీటీసీ తమ్ముల శాంబశివ నాయుడు మృతి పార్టీకి తీరని లోటని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ పేర్కొన్నారు. గుడిపాల మండలం బట్టువాళ్ల ఊరులో సాంబశివ నాయుడి మృతదేహానికి మంగళవారం ఎమ్మెల్యే పూలమాలవేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. టిడిపి అండగా ఉంటుందని, తామంతా ఉన్నామని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు, గుడిపాల మండలం ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రం చేస్తున్న దృశ్యం

పరిసరాలు శుభ్రంతోనే ఆరోగ్యం

ప్రజాశక్తి -గంగవరం: పరిసరాలు శుభ్రంగా ఉంటే నే గ్రామం బాగుం టుందని గ్రామం బాగుంటే ప్రజ లందరూ బాగుంటారని గంగవరం పంచాయతీ సర్పంచ్ చంద్రమ్మ అన్నారు. మంగళవారం గంగవరం గ్రామ పంచాయతీలో ప్రతి గ్రామంలోని మురికి కాలువలు శుభ్రం చేయించి వీధిలైట్లు వెలగని చోట గుర్తించి అన్నింటికి కొత్త బల్బులు వేయించారు. ఈ సందర్భంగా చంద్రమ్మ మాట్లాడుతూ మహిళలు ముఖ్యంగా తమ ఇళ్ల నుండి తడి చెత్త పొడి చెత్త వేరు చేసి అధికారులు ఏర్పాటు చేసిన చెత్త బుట్టలలో వేయాలని ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే కుటుంబం ఆరోగ్యవంతంగా ఉంటుం దన్నారు. ప్లాస్టిక్ వాడకాలు తగ్గించాలని సూచించారు.

విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి -విజయపురం (నగరి) : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జువాలజీ విభాగం ఆధ్వర్యంలో పౌల్ట్రీ ఫార్మ్‌పై అతిథి ఉపన్యాసం నిర్వహించారు. మంగళవారం ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు ఆర్ వేణుగోపాల్ ప్రారంభించి, పౌల్ట్రీ ప్రాముఖ్యత, ప్రపంచవ్యాప్తంగా వీటికి పెరుగుతున్న డిమాండ్, ఆహార భద్రత, ఉపాధి అవకాశాలను వివరించారు. ఈ సందర్భంగా ప్రముఖ పారిశ్రామికవేత్త, జువాలజీ విభాగ బోర్డ్ ఆఫ్ స్టడీస్ సభ్యులు కెఎస్ మనోజ్ పౌల్ట్రీ రంగంలోని వ్యాపార అవకాశాలు, భవిష్యత్ సాధ్యాల గురించి వివరించి, విద్యార్థులతో చర్చించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. భాస్కర్ రాజు మాట్లాడుతూ. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో పౌల్ట్రీ రంగం గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలపరుస్తుందని, జీవనోపాధి అవకాశాలు కల్పిస్తుందని వివరించారు. పౌల్ట్రీ రంగంలోని పోషక, ఆర్థిక ప్రయోజనాల గురించి వివరించారు. ప్రస్తుత సమయంలో ప్రొటీన్ అవసరాలు, పోషకాహార లోపాల సమస్యలకు పౌల్ట్రీ సాధ్యమయ్యే పరిష్కారాలను చర్చించారు. విద్యార్థులు రూపొందించిన పౌల్ట్రీ నమూనా పోటీలో విద్యార్థులు చేసిన నమూనాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఐక్యూ కోఆర్డినేటర్ డాక్టరు ఇంద్ర ప్రియదర్శిని, జువాలజీ విభాగాధ్యక్షురాలు, ఈ కార్యక్రమ కోఆర్డినేటర్ డాక్టరు జి స్వాతి, అధ్యాపకులు రేవతి, అరుణ కుమారి, సుహాసిని, శ్రీలక్ష్మీ, తిరుమల వాసుదేవరావు, రామానుజులు పాల్గొన్నారు.

బిటెక్ ద్వితీయ సెమిస్టర్ పరీక్షా ఫలితాలు విడుదల చేస్తున్న దృశ్యం

బిటెక్ ద్వితీయ సెమిస్టర్ పరీక్షా ఫలితాలు విడుదల

ప్రజాశక్తి-కుప్పం : కుప్పం మండలంలో స్వతంత్ర ప్రతిపత్తి కలిగి నడుస్తున్న కుప్పం ఇంజనీరింగ్ కళాశాల ద్వితీయ సెమిస్టర్ ఫలితాలను మంగళవారం విడుదల చేశారు. బిసిఎన్ సంస్థల వ్యవస్థాపక అధ్యక్షులు బిసి నాగరాజు, జవహర్ లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం పరీక్షల పరిశీలకులు ఆచార్య వి బి చిత్ర లు పరీక్ష ఫలితాలను విడుదల చేశారు. అనంతరం బిసిఎన్ విద్యాసంస్థల వ్యవస్థాపక అధ్యక్షులు మాట్లాడుతూ ద్వితీయ సెమిస్టర్ పరీక్ష ఫలితాలలో కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. పరీక్షా ఫలితాల ప్రకారం బ్రహ్మీని 94.6 శాతం, కొసిరెడ్డి రక్షిత 93.8 శాతం, కొట్టే వాగ్దేవి 92.9 శాతం మార్కులు సాధించి, ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచినట్లు తెలిపారు. కళాశాల వనరులను వినియోగించుకుని విద్యార్థులందరూ మంచి విద్యను అభ్యసించి, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ -చైర్మన్ డా సునీల్ రాజ్, కార్యదర్శి సాగర్ రాజ్, ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర బాబు, వైస్-ప్రిన్సిపాల్ డాక్టర్ భాస్కరన్, హ్యూమానిటీస్ అండ్ సైన్సస్ విభాగాధిపతి జె. మాధవన్, కళాశాల కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ సోమ సుందరం, విభాగాధిపతులు పాల్గొన్నారు.

మామిడి రైతు సంక్షేమానికి కట్టుబడి వున్నాం..

- జిల్లాలో గుజ్జు పరిశ్రమలు టన్నుకు రూ.8వేలు చెల్లించాలి
- ఆదేశాలు పాటించకుంటే చర్యలు తప్పవు
- జాతీయ మామిడి దినోత్సవ వేడుకల్లో చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: మామిడి రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని , జిల్లాలోని తోతాపూరి మామిడి కి ప్రభుత్వ మద్దతు ధర నాలుగు రూపాయలతో పాటు గుజ్జు పరిశ్రమలు 8 రూపాయలు కలిపి12 రూపాయలను మామిడి రైతులకు చెల్లించాలని, లేని పక్షంలో ఫ్యాక్టరీల పైన కఠిన చర్యలు తీసుకుంటామని చిత్తూరు పూతలపట్టు ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్, మురళీమోహన్‌లు స్పష్టం చేశారు. మంగళవారం చిత్తూరులోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జాతీయ మామిడి దినోత్సవ వేడుకలను జిల్లా మామిడి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్తూరు ఎమ్మెల్యే జగన్మోహన్ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది మామిడి రైతు సంక్షోభాన్ని ఎదుర్కోవాల్సి వచ్చిందని, దీన్ని దృష్టిలో ఉంచుకొని మామిడి రైతుల (రైతన్న) కోరి ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకొచ్చినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తోతాపూరి మామిడికి నాలుగు రూపాయలు ప్రోత్సాహ ధరను ప్రకటించిందని తెలిపారు. ఫ్యాక్టరీలు 8 రూపాయలను కచ్చితంగా చెల్లించాలని లేని పక్షంలో ఆ ఫ్యాక్టరీలకు మనుగడ ఉండదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు సంబంధించి 260 కోట్ల రూపాయలను ప్రభుత్వం మంజూరు చేసినట్లు తెలిపారు. రైతులు కూడా పరిస్థితుల అనుకూలంగా పంట సాగులో మెలుకువలు పాటించాలని, జిల్లాలో చిన్న గుజ్జు పరిశ్రమ ఏర్పాటుకు రైతులు మక్కువ చూపాలన్నారు. అప్పుడే మామిడికి గిట్టుబాటు ధర సాధ్యమవుతుందన్నారు. కొన్నిచోట్ల ర్యాంపుల వద్ద రైతులకు అతి స్వల్పంగా రెండు రూపాయల నుంచి మూడు రూపాయల వరకు ఇచ్చినట్లు తమ దృష్టికి వచ్చిందని అలాంటి వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మామిడి రైతులు నష్టపోకూడదన్న ఉద్దేశంతో నాలుగు రూపాయలను ప్రోత్సాహ ధర నిర్ణయించిందని తెలిపారు. రాజకీయ అవగాహన లోపంతో ప్రభుత్వం పై నిందలు వేయడం భావ్యం కాదన్నారు. తాజాగా కేంద్ర ప్రభుత్వం జాతీయ మామిడి దినోత్సవం సందర్భంగా రైతులు టీపీ అందించిందని, క్వింటాలు తోతాపూరి మామిడి కి 14090 రూపాయల మద్దతు ధర ప్రకటించినట్లు తెలిపారు. హార్టికల్చర్ డిడి మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన చిత్తూరు నగరంలో ప్రస్తుత క్లిష్ట పరిస్థితుల్లో సైతం జాతీయ మామిడి దినోత్సవ వేడుకలను నిర్వహించడం గొప్ప విషయం అన్నారు. ఏపీ రైతు సంఘం నేత రామానాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం మామిడి రైతుల పట్ల చిన్నచూపు చూస్తోందని కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్ణయించిన 12 రూపాయల ధరను విధిగా ప్రతి ఫ్యాక్టరీ చెల్లించాల్సి ఉన్నా అనేక ఫ్యాక్టరీలు చెల్లించడం లేదన్నారు. జిల్లా మామిడి సంక్షేమ సంఘం కన్వీనర్ జనార్ధన్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతు కష్టాలను చూసి నాలుగు రూపాయ లను ప్రోత్సాహ ధరను ప్రకటించడం గొప్ప విషయ మన్నారు. ఈ ధరలను అనేక ఫ్యాక్టరీలు ఇవ్వడం లేదని వాటిపై చర్యలు తీసుకోవాలన్నారు. రైతు సంఘం

మామిడి దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న రైతు సంఘాల నాయకులు

నేత ఆనంద నాయుడు మాట్లాడుతూ ధరలను రైతుల నిర్ణయించే పరిస్థితి రావాల్సిన అవసరం ఉందన్నారు . ఇందుకోసం రైతుల్లో ఐక్యత ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్, చిత్తూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చంద్ర ప్రకాష్, మాజీ ఎంపీపీ జయచంద్ర నాయుడు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర నాయకురాలు హేమలత, జిల్లా కార్యదర్శి, మామిడి రైతుల సంక్షేమ సంఘం కన్వీనర్ శంకర్ రైతు సంఘాల నాయకులు హరిబాబు చౌదరి, మునీశ్వర్ రెడ్డి, ఆంజనేయులు, హేమలత, వెంకటాచలం భాస్కర్ రెడ్డి, ఉమాపతి నాయుడు, సందీప్, మునిరత్నంనాయుడు, సంజీవరెడ్డి, మురళి, పలువురు నేతలు అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వైసిపి నాయకులు

అక్రమ అరెస్టులతో అడ్డుకోలేరు: వైసిపి

ప్రజాశక్తి - పూతలపట్టు : అక్రమ కేసులతో వైసిపిని అడ్డుకోలేరని వైసీపీ రాష్ట్ర బీసీ విభాగపు అధికార ప్రతినిధి టీఎస్ యతీష్ అన్నారు. మంగళవారం పూతలపట్టు ప్రెస్ క్లబ్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి అరెస్ట్ కూడా అక్రమమే అని అభిప్రాయపడ్డారు. వైసీపీ నాయకుల కార్యకర్తల అరెస్టులు కూటమికి తాత్కాలికమైన సంతోషమే తప్ప సాక్ష్యాలు లేని మద్యం కేసు నిలబడే ప్రసక్తే లేదన్నారు. జిల్లా ప్రజల మన్ననలు పొందిన పెద్దిరెడ్డి కుటుంబాన్ని అక్రమ అరెస్టలతో ఇబ్బందులకు గురిచేస్తున్న విషయం ప్రజలకు తెలుసునన్నారు. రాజకీయ చదరంగంలో ముగ్గురు మాజీ ముఖ్యమంత్రుల వారసత్వల ఎత్తులు చిత్తు చేసి ప్రజ క్షేత్రంలో గెలుపొందిన నాయకుడు మిథున్ రెడ్డి అని, అలాంటి నాయకుడు కేసులకు భయపడుతాడని కోవడం కూటమి భ్రమే అన్నారు. ప్రజల సమస్యలు గాలికి వదిలి.. అక్రమ కేసులతో కాలయాపన చేస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలు తప్పక బుద్ధి చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో మండలం ఎస్‌సి సెల్ ప్రెసిడెంట్ వెంకటరమణ, మాజీ సర్పంచ్ రాజేంద్ర నాయకులు బాలాజి, విజయ్, షణ్ముగం పాల్గొన్నారు.

చిత్రపటాన్ని బహూకరిస్తున్న అధికారి

గణనాథుని సేవలో కర్ణాటక ఎమ్మెల్యే

ప్రజాశక్తి-ఐరాల: కాణిపాకం వరసిద్ధి వినాయకుడిని కర్ణాటక పద్మనాభనగర్ ఎమ్మెల్యే , మాజీ డిప్యూటీ సీఎం అశోక్ సోమవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ ఆయనకు స్వాగతం పలికి దుశ్శాలువతో సత్కరించారు. ఆలయ ఈ.వో పెంచల కిషోర్ నేతృత్వంలో దర్శన ఏర్పాట్లు చేశారు. అశోక్ కుటుంబ సభ్యులతో కలిసి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ వేద ఆశీర్వచన మండపంలో వేద పండితులు వేద ఆశీర్వాదం అందించగా, ఈవో పెంచల కిషోర్ స్వామి శేషవస్త్రంతో సత్కరించి, స్వామి వారి తీర్థ ప్రసాదాలు, చిత్ర పటాన్ని అందిం చారు. ఈ కార్యక్ర మంలో పూతల పట్టు నియో జకవర్గం పోల్ మేనేజ్ మెంటు కోఆర్డినేటర్ గిరిధర్ బాబు, బంగారుపాళ్యం మండల అధ్యక్షులు ఎన్‌పి ధరణీ నాయుడు, తవణంపల్లె మండల అధ్యక్షులు వెంకటేష్ చౌదరి, కాణిపాకం మాజీ చైర్మన్ మణి నాయుడు, నాయకులు మధుసూదనరావు, హేమాద్రి నాయుడు పాల్గొన్నారు.

భక్తులకు, అర్చకులకు కనీస వసతులు కరువు

- ఎండోమెంట్ అధికారుల నిర్లక్ష్యం
- పలమనేరు శివాలయంలో ఇదీ పరిస్థితి

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు పట్టణంలోని శివాలయంలో ఎండోమెంట్ అధికారుల నిర్లక్ష్యం కళ్లకు కట్టినట్లు కనిపిస్తోంది. భక్తుల నిధుల సేకరణలో ఉన్న ఆసక్తి, ఆ భక్తులకు కనీస వసతులు కల్పించడంలో పూర్తిగా విఫల మయ్యారని భక్తులు వాపోతున్నారు. శివాలయ ప్రాంగణంలో శివాలయంతో పాటు సుబ్రహ్మణ్యం స్వామి అయ్యప్ప స్వామి , నవగ్రహాలయం, ఉపాలయాలు కూడా ఉన్నాయి. ఇక్కడ దాదాపు 5లేక ఆరుగురు అర్చకులు పనిచేస్తుంటారు. ప్రతి రోజూ దాదాపు వెయ్యి మంది భక్తులు ఈ ఆలయాన్ని సందర్శిస్తుంటారు. ఇక్కడికి వచ్చినప్పుడు అన్ని గుడులను దర్శించుకుని వెళ్లాలంటే కనీసం అర్థగంట నుంచి గంట సమయం పడుతుంది. ఈ మధ్యలో భక్తులకు ఏదైనా అత్యవసర పరిస్థితి వచ్చి మూత్ర విసర్జన చేయాలన్నా కనీస సౌకర్యం లేక మధ్యలోనే ఆపివేసి బయట వెళ్లాల్సిన పరిస్థితి ఎదురవుతోందని భక్తులు వాపోతున్నారు. ఇదే పరిస్థితి అర్చకులు కూడా ఎదుర్కొంటున్నారు. అనేకసార్లు భక్తులు కాళ్లు చేతులు కడుక్కోవడానికి వెళ్లి చూడగా కుళాయిల్లో నీళ్లు రాని పరిస్థితి.. ఈ విషయం సంబంధిత సిబ్బందికి తెలుపగా అప్పుడు వారి వెళ్లి మోటర్ స్విచ్ ఆన్

చేస్తున్నారు. ఈమధ్య శివాలయం గాలిగోపురం పనులు జరుగుతున్న దృష్ట్యా గుడి ఆవరణలో ట్రాక్టర్లు, జెసిబిలు వెళ్లి ఫ్లోరింగ్ పూర్తిగా దెబ్బతిని రాళ్లు, ముక్కలు తేలాయి. వాటిని సరిగా శుభ్రం చేయకపోవడంతో భక్తులకు ఇబ్బందులు కలుగుతున్నాయి. సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకొని శివాలయం భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించాలని కోరుకుంటున్నారు.

దళితుల సమస్యలు పరిష్కరించండి: ఎంపిపి

ప్రజాశక్తి -వి కోట : మండల పరిధిలోని దళితుల సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని వాటిని పరిష్కరించాలని ఎంపీపీ యువరాజ్ తెలిపారు. వి కోట శ్రీ శక్తి భవనంలో ఎంపీపీ యువరాజ్ అధ్యక్షతన తహశీల్దారు ఉదయ్ సంతోష్ ఆధ్వర్యంలో మండల ఎస్‌సి, ఎస్‌టి మానిటరింగ్ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు శాఖల అధికారులు పాల్గొని దళిత నేతలు అడిగిన సమస్యలను, వాటి పరిష్కారానికి తీసుకునే చర్యలు వివరించారు. ప్రధానంగా మండల పరిధిలోని గ్రామాల్లో దళితుల శ్మశాన వాటికల దురాక్రమణలు తొలగించి, వాటికి హద్దులు చూపి ప్రతి దళిత శ్మశాన వాటికకు దారి సౌకర్యం కల్పించాలని దళిత సంఘాల నేతలు డిమాండ్ చేశారు. నడ మంత్రం ఎస్టీ కాలనీ కి చెందిన సుమారు 17 మంది నిరుపేదలకు వ్యవసాయ భూమిని ప్రభుత్వం అందించాలని సమావేశంలో కోరారు. అవసరమైన దళితవాడలకు సిమెంట్ రోడ్లు, మురుగునీటి కాలువలు నిర్మాణ పనులు చేపట్టి తాగునీటి సౌకర్యం కల్పించాలని సభ్యులు కోరారు. ప్రధానంగా దళితులపై వివక్షత లేని సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీవో ఈశ్వరన్ తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ యువరాజ్

అనుగుణం గా ప్రైవేట్ పాఠశాలల్లో దళిత విద్యార్థులకు అందాల్సిన సౌకర్యాల సక్రమంగా అమలు అయ్యేలా విద్యాశాఖ అధికారి పరిశీలించాలని సభ్యులు డిమాండు చేశారు. సమావేశానికి గైర్హాజరైన వివిధ శాఖల అధి కారులపై ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామన్నారు. వచ్చే సమావేశానికి సమావేశంలో ప్రస్తావించిన సమస్యల పరిష్కార నివేదికలను సభ్యులకు అందుబాటులో ఉంచాలని ఎంపీడీవో వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంఈఓ చంద్రశేఖర్, ఏవో అప్పోజి, ఏపిఓ గౌరీశంకర్ , ఏపీఎం లావణ్య, వివిధ శాఖల అధికారులు , దళిత సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించండి: ఎంపీడీవో

ప్రజాశక్తి -కార్వేటినగరం: గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఎంపీడీవో చంద్రమౌళి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కత్తెరపల్లి పీహెచ్సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం వ్యాక్సిన్, మందుల వివరాలను ఫార్మాసిస్టును అడిగి తెలుసుకున్నారు. ఆనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్న ముఖ్య

ఆస్పత్రి భవనం కోసం అన్వేషిస్తున్న ఎంపీడీవో చంద్రమౌళి

ఉద్దేశంతోనే ప్రభుత్వం కత్తెరపల్లెలో పీహెచ్సీని ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. సిబ్బంది రోగులకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యసేవలు అందించడానికి కృషి చేయాలని సూచించారు. ఈ క్రమంలో భాగంగా గ్రామస్తులు. సిబ్బంది ఆస్పత్రి భవనం ఉరుస్తుందని, దీంతో మందులు తడిచి పోతున్నాయని, గర్భిణులు, బాలింతలను పరీక్షించడానికి తగిన వసతులు లేక ఇబ్బందులు పడుతున్నట్లు ఎంపీడీవో దృష్టికి తీసుకు రావడంతో ఆస్పత్రికి కావాల్సిన భవనం ఏర్పాటుకు బీసీ బాలుర వసతి గృహం వద్ద ఆర్థాంతరంగా నిర్మాణంలో నిలిచి పోయిన భవనాన్ని పరిశీలించారు. కొత్త భవనం నిర్మాణం చేపట్టే లోపు రోగులు ఇబ్బంది పడకుండా ఉండేలా ప్రైవేటు భవనం ఏర్పాటు చేయడానికి గ్రామంలో అన్వేషించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్సీ వైద్యాధికారిణి డాక్టర్ హేమశ్రీ, కార్యదర్శి జయప్రకాష్, ఉప సర్పంచ్ కుప్పయ్య, ఫార్మాసిస్టు వరలక్ష్మి, వైద్య సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

మంటలు అదుపు చేస్తున్న అగ్నిమాపక అధికారులు

అగ్ని ప్రమాదం

తృటిలో తప్పిన పెనుముప్పు

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు పాతపేటలోని భజంత్రి వీధిలో వుంటున్న బాబు ఇంట్లో మంగలవారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. వంటింట్లో వంట చేస్తున్నప్పుడు నూనె మంటల్లో ఎగిరిపడి ప్రమాదం సంభవించింది. ఇరుగు, పొరుగు వారు వెంటనే వంటింటిలోని గ్యాస్ సిలిండర్లను బయటకు తీసుకు రావడంతో తృటిలో పెద్ద ప్రాణ నష్టం ప్రమాదం తొలగిపోయింది. అగ్నిమాపక కేంద్రానికి ఫిర్యాదు చేయగా అగ్నిమాపక సిబ్బంది తక్షణమే వచ్చి మంటలను అదుపు చేశారు. ఎలాంటి ప్రాణ నష్టం సంభవించలేదు. దాదాపు ఒకటిన్నర లక్ష విలువ చేసే వస్తు సామగ్రి కాలి బూడిద అయినట్లు తెలిపారు.

ఎంపీ అరెస్టుకు నిరసన

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: వైసిపి మాజీ ఎంపీ మిథున్ రెడ్డి అరెస్ట్‌కు నిరసనగా మండలం లోని మొగసాల బ్రదర్స్ ఆధ్వర్యంలో మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచులు వైసిపి సభ్యులు అధిక సంఖ్యలో జేబులకు నల్ల బ్యాడ్జీలు ధరించి నాలుగు రోడ్ల కూడలి నుండి ఇండియన్ బ్యాంక్ వరకు ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి కృష్ణమూర్తి. ఎంపీపీ ఎం రెడ్డప్ప, సంయుక్త కార్యదర్శి దయానంద గౌడ్, వైస్ ఎంపీపీలు రూపా జై కుమార్, నారాయణస్వామి, కార్తికేయన్, తబరోజ్, మహేష్, మండల సర్పంచులు, ఎంపిటిసిలు, వైసిపి కార్యకర్తలు, సభ్యులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: అరెస్టులతో ప్రజల గొంతులను నొక్కలేరని వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి అన్నారు. ఆయన మాట్లాడుతూ ఎంపి మిథున్ రెడ్డిని అక్రమ కేసు నమోదు చేసి జైల్లో ఉంచడం సక్రమమైన పద్ధతి కాదని అక్రమ కేసులతో ప్రతిపక్ష గొంతు నొక్కాలనుకోవడం చాలా దారుణమన్నారు.

ఎస్ఆర్ పురం లో

ఎస్ఆర్ పురం : ఎంపీ మిథున్ రెడ్డిని అరెస్టు దారుణమని అతని రాజకీయ కక్షలతో అరెస్టు చేశారని మిథున్ రెడ్డి నిరపరాధిగా కడిగిన ముత్యం వలే బయటకు వస్తారని వైసిపి రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి చంద్రగిరి కాళ్లప్ప అన్నారు. గంగాధర నెల్లూరు నియోజకవర్గం, వైసిపి శ్రేణులు ఆధ్వర్యంలో మంగళవారం యస్ఆర్ పురం మండలంలో నిరసనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనార్ధన్ , నియోజకవర్గ కల్చరల్ అధ్యక్షుడు నాగమణి నియోజకవర్గ వికలాంగుల అధ్యక్షుడు రమేష్, మండల ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు గిరిబాబు, మండల రైతు విభాగం వైస్ చైర్మన్ శివలింగం మండల యూత్ ప్రధాన కార్యదర్శి పేతురు, విద్యార్థి విభాగం కార్యదర్శి హరిష్ మండల కార్యదర్శి అల్లెయ్య వాలంటరీ విభాగం కార్యదర్శి కోటీశ్వర్ అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వి కోట : ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి అరెస్టును తీవ్రంగా ఖండిస్తూ వి కోట పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద మంగళవారం వైసీపీ నాయకులు ఆందోళన చేపట్టారు. ఎంపీపీ , వైసిపి మండల అధ్యక్షులు యువరాజ్ ఆధ్వర్యంలో మండలంలోని వైసిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున అంబేద్కర్ విగ్రహం వద్ద అరెస్టును ఖండిస్తూ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో నేతలు తమీంఖాన్ , పిఎస్ లక్ష్మమ్మ , గౌస్ , గోపిరెడ్డి, శ్రీనివాసులు తో పాటు పెద్ద ఎత్తున నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

పి4 వార్డు సభలు విజయవంతం

ప్రజాశక్తి- పలమనేరు: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు పి 4 (ప్రభుత్వ, ప్రైవేటు, ప్రజల భాగస్వామ్యం) సర్వేలో భాగంగా ప్రతి వార్డు సచివాలయ పరిధిలో నిర్వహించిన వార్డు సభలు విజయవంతం అయ్యాయి. కాకాతోపు వార్డు సచివాలయం, రంగాపురం వార్డు సచివాలయంలో పి 4 వార్డు సభ నిర్వహించారు. పలు చోట్ల పి4 వార్డు సభలు ఏర్పాటు చేశారు. ఈ వార్డు సభలలో ఎస్ఎం ఖాదర్ మొహిద్దీన్, మునిసిపల్ మేనేజర్ , బాబా , వార్డు కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

మునే గౌడకి పరామర్శ

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: తీర్థం గ్రామ పంచాయతీ తీర్థం గ్రామానికి చెందిన వైసిపి మండల జనరల్ సెక్రటరీ మునే గౌడ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయ పడ్డారు. చికిత్స నిమిత్తం స్వగ్రామంలో ఉన్న మునెగౌడును వైసిపి రాష్ట్ర కార్యదర్శి మొగసాల కృష్ణమూర్తి, రాష్ట్ర ఎంపీపీ సంఘం అధ్యక్షులు, బైరెడ్డిపల్లి మండల ఎంపీపీ మొగసాల రెడ్డప్ప , సర్పంచులు జ్యోతి, శ్రీనివాస్, బైరెడ్డిపల్లి సర్పంచ్ కొమ్ము వెంకటేష్, రమణారెడ్డి, స్థానిక ఎంపిటిసి తనయుడు కేశవులు వైస్ ఎంపీపీ రూపాజై కుమార్, బైరెడ్డిపల్లి మండలం యూత్ ప్రెసిడెంట్ మహేష్ కలసి తీర్థం గ్రామానికి చేరుకుని మునే గౌడ్ ఆరోగ్య విషయాలు తెలుసుకుని వారి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం ఎంపీపీ ఎం.రెడ్డప్ప మాట్లాడుతూ ఏ కష్టం వచ్చినా వైసిపి సభ్యులకు మండల నాయకులుగా తాము అండగా వుండి ఆదుకుంటామని తెలిపారు.

మండల సమావేశంలో సమస్యలపై ధ్వజం

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: మండలంలోని కొన్ని గ్రామాలలో ఇప్పటివరకు శ్మశాన వాటికలు లేవని వాటిని ఏర్పాటు చేయాలని సభ్యులు ధ్వజమెత్తారు. గంగాధర నెల్లూరు మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అనిత అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. పెద్ద కాలువ సర్పంచ్ ఏకాంబరం మాట్లాడుతూ మండలంలో రెవెన్యూ సమస్యలు ఎక్కువ గా సమస్యలు ఉన్నాయని, వాటిని వీలైనంతవరకు త్వరగా పరిష్కరించాలని ఆయన కోరారు. వెజ్జు పల్లి సర్పంచ్ హరిప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో వీధిలైట్లు రేయి, పగలుతేడా లేకుండా వెలుగుతూనే ఉన్నాయని దీనివల్ల విద్యుత్ చార్జీల భారంగా మారిందన్నారు. గంగాధర నెల్లూరు సర్పంచ్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ గంగాధర నెల్లూరు లో ఏళ్ల తరబడి మా గ్రామానికి శ్మశాన వాటిక లేదు స్మశాన వాటిక ఏర్పాటు చేయాలని ఆయన అధికారులను కోరారు. బాల్యవివాహాలు అరికట్టాలని సభ్యులు అడగ్గా అందుకు ఎంపీడీవో కృష్ణ మహేశ్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో అటువంటి ఏవైనా ఉంటే తమ దృష్టికి తీసుకురండి గ్రామాల్లో సభ్యులుగా మీకు బాధ్యత ఉందని మీరు గ్రామాల్లో అవగాహన కల్పించండి ఈ బాల్య వివాహాలు అరికట్టేందుకు భాగస్వాములు కావాలని ఆయన సభ్యులను కోరారు. తహశీల్దార్ శ్రీనివాసులు మాట్లాడుతూ రైతులు రీ సర్వే లో ఏవైనా సమస్యలు ఉంటే నా దృష్టికి తెస్తే వాటిని పరిశీలించి వీలైనంత త్వరగా

మండల సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

సమస్యను పరిష్కరిస్తామని ఆయన తెలిపారు. అంగన్ వాడీ సూపరు వైజర్ అనురాధ మాట్లాడుతూ గ్రామాల్లో తాము బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమాలు చేస్తున్నామని ఆమె పేర్కొన్నారు. సభ్యులు మాట్లాడుతూ కొంతమంది అధికారులు మండల సర్వసభ్య సభ్య సమావేశానికి రాని వారిని చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో కృష్ణ మహేష్ రెడ్డిని సభ్యులు కోరారు. వెలుగు ఏపిఎం ఫరీద్ మస్తాన్ మాట్లాడుతూ మండలంలోని డ్వాక్రా గ్రూపు సభ్యులు పొదుపులను పెంచుకుంటే గ్రూప్ సభ్యులు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి లక్ష్మి ప్రియ, వైస్ ఎంపీపీలు హరిబాబు, బేబి, హౌసింగ్ ఏఈ శ్రీధర్, ఎంఈఓ గుణశేఖర్ రెడ్డి,విద్యుత్ ఏఈ వరదరాజులు, అగ్రికల్చర్ ఏవో భవాని, ఏవో లోకేష్, ఉపాధి హామీ ఏపీవో శ్రీనివాసులు, ఆర్ డబ్ల్యూ ఎస్ ఏఈ ఈశ్వర ప్రసాద్, ఏ ఎస్ డబ్ల్యూ షకీలా, డాక్టర్లు గురు ప్రకాష్, ప్రవీణ్, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ గీత, సెక్రటరీ శివయ్య, పలువురు అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

చిన్ననాటి స్నేహితుల అపూర్వ కలయిక

ప్రజాశక్తి- శాంతిపురం: చిన్ననాడు కలసి చదువుకుని పదవతరగతి తరువాత విడిపోయి సుమారు 30 సంవత్సరాల తరువాత అందరూ చిన్ననాటి మిత్రులు మండలంలో మంగళవారం కలుసుకున్నారు. 1995-96 విద్యాసంవత్సరంలో శాంతిపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవతరగతి చదువుకున్న విద్యార్థులు పరీక్షల అనంతరం పలువురు ఉన్నత విద్యకు, మరికొంత మంది విద్య మానేసినవారు, మరికొంతమంది ఇతర వృత్తులలో స్థిరపడి ఒకరికొకరు దూరమయ్యారు. సుమారు 30 సంవత్సరాల తరువాత మంగళవారం మండల పరిధిలోని వరదేపల్లె వద్దనున్న శ్రీ ఇరుగులమ్మ దేవాలయం వద్ద సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలు, బాల్యంలో

చేసిన చిలిపి చేష్టలు నెమరువేసుకున్నారు. తమ తో పాటు విద్యనభ్యసించి మృతి చెందిన మిత్రుల కుటుంబాలకు బాసటగా నిలవాలని తీర్మానించుకున్నారు. తమ మిత్ర బృందం తరపున పలు సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించడానికి సన్నాహకాలు చేస్తున్నామని తెలిపారు.

కూటమి ప్రభుత్వంతోనే సుపరిపాలన: ఎమ్మెల్యే

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : రాష్ట్రంలో సుపరిపాలన కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ అన్నారు. 'సుపరి పాలనలో తొలి అడుగు - ఇంటింటికి మీ ఎమ్మెల్యే' కార్యక్రమం లో భాగంగా మంగళవారం చిత్తూరు రూరల్ మండలం దిగువ మాసాపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు వివరించారు. ఈ సందర్భంగా బంగారెడ్డి పల్లి- యానాది కాలనీ సిమెంట్ రోడ్డును ప్రారంభించారు. స్థానిక ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటారు. విద్యార్థులతో కాసేపు ముచ్చ టించారు. సాయంత్రం ముత్తుకూరు, ఆనగల్లు, పాలూరు గ్రామ పంచాయతీలో ఎమ్మెల్యే సోదరుడు గురజాల జీవన్ ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చుడా చైర్ పర్సన్ కఠారి హేమలత, టిడిపి సీనియర్ నాయకులు చంద్ర ప్రకాష్, నాయకులు శశిధర్ బాబ, మోహన్ రాజ్, జయచంద్ర

మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే

వెదురుకుప్పంలో

నాయుడు, మేసక్, జగదీశ్వర్ నాయుడు, రఘు, మంజూష్, ఎంపిటిసిలు, సర్పంచులు, కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: ప్రజలకు మంచి చేయాలని ఉద్దేశంతోనే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. వారి కోసమే అహర్నిశలు ఆలోచిస్తుందని గంగాధర నెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే విఎం థామస్, అన్నారు. సోమవారం మండలంలోని పచ్చికాపల్లం లో 'సుపరిపాలనకు తొలి అడుగు' నిర్వహించారు. ఈ కార్యక్రమం మండల పార్టీ అధ్యక్షులు కామసాని లోకనాథరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రతి ఒక ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను తెలిపి అర్హులైన వారికి సంక్షేమ ఫలాలు ప్రభుత్వం నుంచి అందకుండా ఉంటే అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రతి ఒక్కరూ కూటమి ప్రభుత్వాన్ని ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట తెలుగు తమ్ముళ్లు ఉన్నారు.

రామకుప్పం: కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర నేతలు మునస్వామి, నారాయణ చారి, ఆంజనేయ రెడ్డి, సీతాపతి పేర్కొన్నారు. ఏడాది సుపరిపాలన కార్యక్రమం రామకుప్పం లో నిర్వహించారు.ఈ సందర్భంగా ఇంటింటికి ప్రభుత్వం ద్వారా అందిస్తున్న సంక్షేమ కరపత్రాలను అందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో , జయశంకర్, గిరిదాసు,అల్లి శీన,అవినాష్ మంజునాథ్ పాల్గొన్నారు.

కార్వేటినగరం : పంచాయతీ పరిధిలోని సిడి కండిగా, కొండరామాపురం, కేశవకుప్పం పంచాయతీలో సోమవారం సుపరిపాలనకు తొలి అడుగును టిడిపి మండల అధ్యక్షులు చెంగల్రాయల్ యాదవ్, రాజా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరులు రాజా, ప్రధాన కార్యదర్శి రాజేంద్ర రెడ్డి, రాష్ట్ర రైతు కార్యదర్శి జనార్ధన్ రాజు దాసరి గణేష్ శ్రీనివాసులు యాదవ్ పి చంద్రం ఎస్ చంద్రయ్య నరేష్ నడిపి రెడ్డి సురేష్ ఎన్ బాబు, పి సుబ్రహ్మణ్యం, పొద్దుటూరు రాజా లక్ష్మణరాజు. మండల ఉపాధ్యక్షులు సోమశేఖర్ మండల డేటా అనాలసిస్ట్ కిషోర్ కుమార్ పాల్గొన్నారు.